క్లుప్తంగా

వరిపంట దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట గ్రామానికి చెందిన రైతులు కనపల గొల్లవాడు, కనపల బుచ్చయ్యల నాలుగు ఎకరాల వరి పంట కాలి బూడిదయ్యింది. గురువారం ఉదయం ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో చేతికి అందివచ్చిన పంట దగ్ధమయ్యింది. వాయుగుండం ప్రభావంతో రెండు రోజుల కిందటే వరిచేనుని కుప్పలుగా పెట్టుకున్నారు. పంట పెట్టుబడి పోవడం, చేతికి వస్తున్న ధాన్యం కూడా కాలిపోవడంతో సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లిందని రైతులంటున్నారు. శ్రీకాకుళం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పింది.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని పైడిభీమవరంలో జాతీయ రహదారిపై పోలీసులు గురువారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్: క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ నైరా కళాశాలలో అంతర్ కళాశాలల క్రీడల ముగింపు కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. విజేతలకు అభినందనలు తెలిపి బహుమతులను అందజేశారు. వ్యవసాయ విద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ కరుణాసాగర్ మాట్లాడుతూ నాలుగు రోజులు క్రీడలను ఎంతో ఆహ్లాదకరంగా నిర్వహించామన్నారు. వీటిలో 16 సంస్థాగత కళాశాలలు, 6 అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకులం న్యూకాలనీ: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సీఐ ఈశ్వరరావు సూచించారు. నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో సంకల్పం పేరిట విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. విద్యతో ఉజ్వలమైన భవిష్యత్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గుట్కా, గంజాయి, సిగరెట్, మద్యం, దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, అత్యాచారాలు లాంటి సంఘ వ్యతిరేఖ కార్యకలాపాలతో జీవితం అస్తవ్యస్తమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి హనుమంతి పోలినాయుడు, ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, కొత్తకోట రవీంద్ర, సాయికృష్ణ, గోపీకృష్ణ పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథునికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో బొందిలిపురంలోని సాయి దర్బార్‌లో షిర్డీ సాయినాథునికి గురువారం ప్రత్యేక పుజలు జరిగాయి. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం కాకాడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అలాగే అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో షిర్డీ సాయిబాబా, వంద అడుగుల ఎత్తునున్న వేంకట సాయికోటి మహాస్థూపం దర్శనానికి గురువారం భారీగా భక్తులు తరలి వచ్చారు. కార్తీక మాసం ఆఖరి గురువారం కావడంతో సాయి నామం మార్మోగింది. అనంతరం అలయం ప్రాంగణంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

- కాంప్లెక్స్ ఎదురుగానే నిలుపుతున్న ప్రైవేటు వాహనాలు
- నిబంధనలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఆగిన ప్రైవేటు బస్సు, ఆటోలు

శ్రీకాకుళం అర్బన్: ములిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా ఉంది ఆర్టీసీ పరిస్థితి. అసలే అన్ సీజన్ కావడంతో అంతంతమాత్రంగా వస్తున్న ఆదాయానికి కూడా ప్రైవేటు వాహనాల పుణ్యమా అంటూ భారీగా గండి పడుతోంది. దీంతో ఏమి చేయాలో పాలుపోక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. స్పెషల్ డ్రైవ్‌ల పేరిట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ప్రైవేటు వాహనాలను నిరోధిస్తున్నప్పటికీ వారు ఉన్నంత సేపు ప్రైవేటు వాహనాలు రావడం లేదు. అనంతరం ఆర్టీసీ అధికారులు అటు వెళ్లగానే ఇటు వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం ప్రైవేటు పరం అవుతోంది.

నిబంధనలకు నీళ్లు

మోటారు వాహన చట్టం ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఏ ఒక్క ప్రైవేటు వాహనం కూడా నిలుపుదల చేయకూడదు. అలా చేస్తే తగు చర్యలు తీసుకోవచ్చు. అయితే కాంప్లెక్స్ ఇన్‌గేట్ పక్కనే ఆటోలు, ప్రైవేటు బస్సులు నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నారు. ఎక్కువగా ఈ సమస్య శ్రీకాకుళం-ఆమదాలవలస బస్సులకు ఉంటోంది. శ్రీకాకుళం పాత బస్టాండ్ నుంచి ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు వెళ్లే బస్సులు కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఆగుతాయి. అయితే ఈ బస్సులు వచ్చేసరికే ఆటోలు, ప్రైవేటు బస్సులు ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నారు.

గతంలో 8 బస్సులు

శ్రీకాకుళం పాతబస్టాండ్-ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు గతంలో ఆర్టీసీ బస్సులు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు చొప్పున 8 బస్సులు ఉండేవి. అప్పుడు ఆదాయం కూడా అంతేస్థాయిలో వచ్చేది. అయితే రానురాను పోటీతత్వం పెరగడం, ఆటోల సంఖ్య, ప్రైవేటు వాహనాల సంఖ్య పెరగడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. దీంతో ఆర్టీసీ బస్సుల సంఖ్య కూడా తగ్గిపోయింది. ప్రస్తుతం శ్రీకాకుళం పాతబస్టాండ్- ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు షటిల్ సర్వీసుల పేరిట మూడు బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. ఈ మూడు బస్సుల్లో కూడా ప్రయాణికులు అంతంతమాత్రంగానే ఎక్కుతున్నారు. ఆర్టీసీ బస్సులు వచ్చేటప్పటికి ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకుపోతుండడంతో వచ్చిన ఆర్టీసీ బస్సులు ఖాళీగానే వెళ్తున్నాయి.

ఆదాయం పెంచేందుకు కృషి



శ్రీకాకుళం పాత బస్టాండ్-ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు మూడు బస్సులు తిరుగుతున్నాయి. ఈ రూట్‌లో ఆయా బస్సుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాం. రవాణాశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆటోలు, ప్రైవేటు వాహనాలపై చర్యలు తీసుకునేలా చూస్తాం.

– హనుమంతు అమరసింహుడు, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్

కనిపించని మొక్కలు



పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఉన్నతాధికారులతో వారి పేర్లు మీద ఫలకాలు ఏర్పాటు చేసి మొక్కలు నాటించారు. తర్వాత వీటి పెంపకం మర్చిపోయారు. దీంతో మొక్కలు కనిపించడం లేదు. ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ప్రారంభానికి సిద్ధంగా..



కళ్లేపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు చివరి దశకు చేరకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీకి రూ.2కోట్ల 27లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం భవనం ప్రారంభానికి సిద్ధమవుతోంది.

– శ్రీకాకుళం రూరల్

వైద్య సేవలు



ఎచ్చెర్ల మండలంలోని కొంగరాం గ్రామంలో విష జ్వరాలు ప్రబలడంతో పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.శేషగిరి ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల పరిస్థితి తెలుసుకొని, పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 54 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. సీజనల్‌గా వైరల్ జ్వరాలు గ్రామంలో ఉన్నాయని, కొద్ది రోజులు మందులు వాడడం, విశ్రాంతి తీసుకోవడం వల్ల తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జి.జగన్నాథరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి సూర్యఅప్పారావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు రోజ్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

మర్యాదపూర్వక భేటీ



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి కార్యాలయంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పిల్లా ఆనందరావు పాత్రుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి వివరించారు.

రణస్థలం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ పూర్తయిన రెండు రోజుల్లో రైతుకు నగదు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని తమ్మినాయుడుపేట సమీప తోటల్లో జరుగుతున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం ఎచ్చెర్ల పోలీసులు దాడి చేశారు. రూ.11400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. జూద శిబిరాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.

పరామర్శ



అచ్చిబాబును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని మరువాడ గ్రామ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల శస్త్ర చికిత్స జరగడంతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం అతనిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలనాయుడు, పిశిని లక్ష్మణరావు ఆయన వెంట ఉన్నారు.

పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలని వ్యక్తిత్వ వికాస శిక్షకుడు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. చిలకపాలేంలోని శ్రీశివానీ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం స్కిల్ అవర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిసున్నాయన్నారు. నైపుణ్య సమూపార్జన, ఇంటర్న్‌షిప్‌లో ప్రయోగాత్మక విద్య నేర్చుకోవాలని సూచించారు. పరిశ్రమలు సైతం పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు



ధాన్యం మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

జి.సిగడాం: రైతులు పండించే ప్రతీ ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించవద్దని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష స్పష్టం చేశారు. మండలంలోని సంతవురిటి గ్రామంలో ఉన్న మిల్లును గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతులు పండించే ధాన్యం, వరి కుప్పలను భద్రపరుచుకోవాలని సూచించారు. రైతుల వద్ద సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో నియమించిన సిబ్బంది పొలంలోనే నాణ్యాతా ప్రమాణాలు చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆమెతోపాటు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏవో యర్రా శారద, ఆర్ఐ రాధ, వీఆర్వో శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హరీష్, సింహాద్రి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ కొత్తగా ప్రవేశపెడుతున్న ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల శాసన సభ్యుడు ఎన్.ఈశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మరింత మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కొత్త బస్సులను ప్రవేశపెడుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ డిపో మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, రెండో డిపో ఎంఎఫ్ చాణక్య, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ భాషా, ఉమామహేశ్వరరావు, ధర్మారావు, శిమ్మయ్య, ఆచారి, రమేష్, ఆర్‌సీ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో వివిధ పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు జరపనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లకుగాను ప్రవేశాలు తక్షణమే చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఏపీ పీజీసెట్-2024 ఎంట్రన్స్ ఎగ్జామ్, క్వాలిఫై, పరీక్షకు హాజరుకావడం వంటి అంశాలతో సంబంధం లేకుండా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కళాశాలలోని వివిధ పీజీ కోర్సులైన ఎంఏ తెలుగులో 29 సీట్లు, ఎమ్మెస్సీ జువాలజీలో 19 సీట్లు, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ విద్యార్హత కలిగిన ధ్రువ పత్రాలతో నేరుగా కళాశాలకు హాజరుకావాలని డాక్టర్ సూర్యచంద్ర తెలిపారు. విద్యార్థులు తమ సందేహాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ 85228 18928, ఎమ్మెస్సీ జువాలజీ 70756 06760, ఎంఏ తెలుగు 94941 35303 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా కల్యాణోత్సవం



సూర్యనారాయణ స్వామివారి కల్యాణ వేడుకలు



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బోడెమ్మ కోవెలలో ఉన్న జీవేశ్వరాలయంలో శివపంచాయతన సహిత రుద్రయాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా నాల్గోరోజు ఆలయ అర్చకులు వేంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు రంగాభట్ల శ్రీను, అనిల్‌శర్మ, కె.శ్రీను పర్యవేక్షణలో సూర్యనారాయణస్వామికి సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగే మహా కుంభాభిషేకం కోసం అష్టోత్తర శత కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్రా వెంకటరావు, తాలాడ రవీంద్ర, బస్వా రవి, యాగాటి ప్రసాద్, చిత్రాడ గాంధీ, బబ్బాది లక్ష్మణరావు, రాయితి చంద్రశేఖర్, గనగళ్ల కొర్లయ్య, శిల్లా శ్రీరామమూర్తి, తంగుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యసాయ అధికారి కె.త్రినాథస్వామి సూచించారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో 100 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు నిర్వహిస్తున్న మూడో రోజు శిక్షణలో గురువారం పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన ఘన, ద్రవ జీవామృతాల తయారీ, విత్తన గుళికల తయారీ, కషాయాలు తయారీ, 365 రోజులు ఆదాయం ఇచ్చే అంతర పంటలు సాగు వంటి వాటిపై ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో 350 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఐదు రోజుల శిక్షణలో ఒక్కరోజు క్షేత్ర పరిశీలన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యవసాయ శాఖ-రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి..రేవతి, అదనపు ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని శ్రీకాకుళం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండల కేంద్రం, అనతిమిత్ర టౌన్ షిప్, ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాల ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం పట్టణంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా నారాయణపురం కుడి కాలువ, మడ్డువలస కాలువ, తోటపల్లి కాలువల పరిస్థితి, సాగునీటికి రైతులు ఈ ఏడాది ఎదుర్కొన్న సమస్యలు వివరించారు. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. భవిష్యత్తులో సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా తీర్థగోష్టి



స్వామివారికి ఆహ్వానం పలుకుతున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: భాష్యకార సిద్ధాంత వ్యవస్థాపకులు త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జియరు స్వామివారి తీర్థగోష్టి గురువారం ఘనంగా జరిగింది. చేపల వీధిలోని మణికొండ రామారావు ఇంట్లో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేపట్టారు. అనంతరం స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు.

సమాజ సేవే లక్ష్యం



పరిశ్రమ వ్యవస్థాపకుడు కేవీకే రాజుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల ఏర్పాటుతో సమాజ సేవ చేయడమే లక్ష్యంగా నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఏర్పాటైందని పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు అన్నారు. అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమ వ్యవస్థాపక దినోత్సవం, వ్యవస్థాపకుడు కేవీకే రాజు జయంతి కార్యక్రమాన్ని గురువారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు చిత్రపటానికి మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ ఏర్పాటు వల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రాంతీయ అభివృద్ధి జరగుతుందన్నారు. స్థానికంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ పథకంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలో ఉద్యోగులు భద్రత నిబంధనలు పాటించాలని, పరిశ్రమ ప్రగతికి కృషి చేయాలన్నారు. పరిశ్రమ ప్రతినిధులు శ్యాంప్రసాద్, చిన్నాదురై పాల్గొన్నారు. పరిశ్రమ సీనియర్ ఉద్యోగులకు సన్మానాలు చేశారు. ఇంటర్, 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

ఆదర్శనీయుడు పూలే

మహాత్మా జ్యోతిరావ్ పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఆయన వర్ధంతి కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రణస్థలం: జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు



శ్రీకాకుళం అర్బన్: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డా.సురేష్ తదితరులు



ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిన్నింటి సాయికుమార్ తదితరులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పూలే విగ్రహానికి నివాళుర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు